'రన్‌ఫర్ జీసెస్'ను విజయవంతం చేయండి

మలక్‌పేట: గుడ్ ఫ్రైడే సందర్భంగా ఈనెల 30న రన్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మలక్‌పేట క్రిస్టియన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సాల్మన్‌రాజ్, మలక్‌పేట నియోజకవర్గ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్యం అబ్రహం తెలిపారు. శనివారం ఉదయం 6 గంటలకు దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చి నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. మూసారంబాగ్ చౌరస్తా మీదుగా అక్బర్‌బాగ్ సర్కిల్, హోరేబు చర్చి, సైదాబాద్, గవర్నమెంట్ ప్రెస్ మీదుగా నల్లగొండ క్రాస్‌రోడ్‌లోని ఎంబీ చర్చి వరకు కొనసాగుతుందన్నారు. పాస్టర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని రన్ ఫర్ జీసెస్ విజయవంతం చేయాలని వారు కోరారు.

31న ఈస్టర్ సన్‌రైజ్ హిల్–టాప్ సర్వీస్

మలక్‌పేట క్రిస్టియన్ అసోసియేషన్, నియోజకవర్గ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, యూత్ ఫెలోషిప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 31న ముంతాజ్ కాలేజీ ఆవరణలో ఆదివారం ఉదయం 5 గంటలకు ఈస్టర్ సన్‌రైజ్ హిల్–టాప్ సర్వీస్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మెదక్ చర్చి బిషప్ డాక్టర్ ఏసీ సాల్మన్ రాజ్, వజ్ర సంతోష కుమారి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. యునైటెడ్ క్వాయర్ టీమ్ వారి సంగీత కార్యక్రమం ఉంటుందన్నారు. క్రైస్తవులందరూ సకాలంలో హాజరు కావాలని కోరారు.

మలక్‌పేటలో ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మలక్‌పేట: ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత ఎన్నికల కోసం ప్రజల్లో భరోసా కల్పించడానికి ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్టు మలక్‌పేట ఏసీపీ శ్యామ్‌సుందర్ అన్నారు. మలక్‌పేట పోలీసుల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం గాంధీనగర్, కల్యాణ్ నగర్, దిల్‌సుఖ్ నగర్, సలీంనగర్, సిరిపురం కాలనీ, బాలదానమ్మ బస్తీ ప్రాంతాలలో పోలీసులు, భద్రతా బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, ఎస్సైలు జయంత్, నవీన్, సురేష్, కిరణ్ లాల్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గ్రేట్ బాంబే సర్కస్ ప్రారంభం


సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహకులు సంజీవ్, సంపత్

వనస్థలిపురం: ప్రఖ్యాతి గాంచిన గ్రేట్ బాంబే సర్కస్ శుక్రవారం వనస్థలిపురం ఆటోనగర్‌లో ప్రారంభమవుతుందని నిర్వాహకులు సంజీవ్, సంపత్ తెలిపారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సర్కస్‌ను ప్రారంభిస్తారని అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నో ఏళ్ల తర్వాత ఆటోనగర్‌లో సర్కస్ తిరిగి ప్రారంభం కానుందని, సర్కస్‌లో ట్రాంపోలిన్, ఎక్సోటిక్ డాగ్ షో, కాలిక్యులేటింగ్ డాగ్, ఫ్లయింగ్ ట్రాపెజ్, ఫైర్ డ్యాన్స్, స్కైవాక్, రోలర్ బ్యాలెన్స్, రోలర్ స్కేటింగ్, విదూషకుల షో తదితర ఎన్నో విన్యాసాలు ఉన్నాయని అన్నారు. సర్కస్‌లో ప్రతి రోజూ మధ్యాహ్నం ఒంటి గంటకు, సాయంత్రం 4 గంటలకు, రాత్రి 7 గంటలకు షోలు ఉంటాయని అన్నారు. ప్రేక్షకుల భద్రతకు అన్ని రక్షణ చర్యలు తీసుకున్నామని వారు తెలిపారు.

ఘనంగా ప్రసన్నాంజనేయ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న పీఠాధిపతులు, భాస్కర్‌రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: రామకృష్ణాపురం డివిజన్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానం 50వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథులుగా శ్రీజగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహా సంస్థాన పీఠాధిపతులు, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుష్పగిరి శంకరాచార్యులు భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. స్వామీజీ మాట్లాడుతూ, దేశంలోని ప్రతి హిందువు ధర్మపరిరక్షణ కోసం కృషి చేస్తూ ధర్మాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, శ్రీరామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ పున్న గణేష్ నేత, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్‌రావు, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు బొడ్డుపల్లి మహిందర్, శేఖర్ ముదిరాజ్, దుర్గప్రసాద్, శివ, శ్రీధర్, బాలరాజు, సంతోష్ పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం: లాభాపేక్ష లేకుండా గ్రామీణ పేదలకు వైద్య సేవలు అందించాలని లిమ్స్ ఎండీ విశ్వనాథ్ అన్నారు. ఇబ్రహీంపట్నంలోని లైఫ్ కేర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ఆస్పత్రి 3వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విశ్వనాథ్ మాట్లాడుతూ.. అత్యాధునిక పరికరాలతో అతి తక్కువ ధరలో పేదవారికి వైద్య సేవలను అందిస్తున్న ఆస్పత్రి లిమ్స్ అని తెలిపారు. ఉచితంగా హెల్త్ చెకప్‌లు నిర్వహిస్తూ గ్రామీణ ప్రాంత ప్రజలకు లిమ్స్ తమ సహకారాన్ని అందిస్తోందన్నారు. ఇక్కడి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా లిమ్స్ సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. ప్రముఖ వైద్యులు దినేష్, రాంరాజ్, నరేష్, అభిలాష్, లౌక్య, గౌతమ్, మేనేజర్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రతి రైతు సంక్షేమమే ధ్యేయంగా సేవలందిస్తున్నామని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ భరత్‌కుమార్ అన్నారు. సంఘంలో సభ్యత్వం ఉండి మృతి చెందిన సభ్యుల కుటుంబాలకు సంఘం ద్వారా రూ.25 వేల నగదు అందజేస్తున్నామన్నారు. తారమతిపేట గ్రామానికి చెందిన ఎం.మల్లయ్య జనవరి 8న మృతిచెందడంతో ఆయన భార్య అంజమ్మకు సంఘం కార్యాలయంలో భరత్‌కుమార్ చేతుల మీదుగా గురువారం రూ.25వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ ఐలేష్‌యాదవ్, నాయకులు మల్లేశ్, యాదయ్య పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్‌లకు అడ్డుకట్టేదీ?

- విజయవాడ జాతీయ రహదారి, సర్వీస్ రోడ్లపై అక్రమ పార్కింగ్‌లు
- ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారుల అవస్థలు
- పట్టించుకోని పోలీసులు



చింతలకుంట దగ్గర సర్వీస్ రోడ్డును ఆక్రమించి హోటల్ ముందు పార్కు చేసిన వాహనాలు

హస్తినాపురం: విజయవాడ జాతీయ రహదారిపై ఒకవైపు రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండగా.. మరోవైపు ఆటోనగర్ నుంచి చింతలకుంట చెక్‌పోస్టు వరకు ఉన్న సర్వీస్ రోడ్డును కొంతమంది వ్యాపార సముదాయాలు, హోటళ్లు, వైన్ షాపుల యజమానులు ఆక్రమించుకుని రోడ్డుపైనే వాహనాలను పార్కింగ్ చేయిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- ఆటోనగర్ నుంచి సుష్మా చౌరస్తా దగ్గర వ్యాపార సముదాయల ముందు రోడ్డును ఆక్రమించుకుని వాహనాలను పార్కింగ్ చేయడంతో కాలనీలోకి వెళ్లేందుకు పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు. సర్వీస్ రోడ్డును పూర్తిగా ఆక్రమించుకుని వాహనాలను పార్కింగ్ చేయడంతో సాయంత్రం వేళల్లో సర్వీస్ రోడ్డు మీదుగా కనీసం నడిచి వెళ్లే పరిస్థితి కూడా ఉండటం లేదని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు ఆక్రమణల కారణంగా సుష్మా చౌరస్తా నుంచి పనామా చౌరస్తా, చింతల్‌కుంట వరకు సాయంత్రం రద్దీ సమయాల్లో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోతున్నాయని


రోడ్డుపై వాహనాలను పార్కింగ్ చేయడంతో స్తంభించిన ట్రాఫిక్

- ఫుట్‌పాత్‌లను ఆక్రమించడమే కాకుండా కొందరు హోటల్ యజమానులు, వైన్స్ యజమానులు సర్వీస్ రోడ్డుపైనే వాహనాలను నిలిపి వేసి అక్రమ పార్కింగ్‌కు పాల్పడుతున్నారు. సర్వీస్ రోడ్డు ఆక్రమణ వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అటు జీహెచ్‌ఎంసీ అధికారులు గానీ, ఇటు ట్రాఫిక్ పోలీసులు గానీ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సర్వీస్ రోడ్డు ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం



విజయవాడ జాతీయ రహదారిపై ఆటోనగర్ నుంచి చింతల్‌కుంట వరకు ఉన్న సర్వీస్ రోడ్డును కొంతమంది వ్యాపారులు ఆక్రమించుకుని వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. సుష్మా చౌరస్తా నుంచి పనామా చౌరస్తా వరకు ఉన్న హోటళ్లు వైన్‌షాపుల యజమానులు సర్వీస్ రోడ్డును ఆక్రమించుకుని పార్కింగ్‌కు పాల్పడుతున్నారు. వారు ఈ అక్రమ పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకుంటాం. జాతీయ రహదారిపై ఇలాంటి అక్రమ పార్కింగ్‌కు పాల్పడితే చట్ట ప్రకారం జరిమానాలు వేసి కఠిన చర్యలు తీసుకుంటాం.

– డి.వెంకటేశ్వర్లు, వనస్థలిపురం ట్రాఫిక్ సీఐ

ఎన్టీఆర్‌నగర్‌లోని పేదల ఇళ్లను రెగ్యులరైజ్ చేయాలి


ఎంపీ రంజిత్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న సయ్యిద్ ఇస్మాయిల్

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని ఎన్‌టీఆర్ నగర్‌లో పేదల ఇళ్లను వెంటనే రెగ్యులరైజేషన్ చేయాలని ది అర్బన్ హట్స్, స్లమ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ట్విన్ సిటీస్ ప్రధాన కార్యదర్శి సయ్యిద్ ఇస్మాయిల్, ఇతర నాయకులు గురువారం చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డికి కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరింపజేయాలని కోరారు. కార్యక్రమంలో బస్తీవాసులు మధు మహరాజు, పదిరే శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోళ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి


మోహన్‌నగర్‌లో కూలిన మ్యాన్‌హోళ్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్, జలమండలి అధికారులు

నాగోలు: ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మోహన్‌నగర్‌లో మెయిన్ రోడ్డులో కూలిపోయిన మ్యాన్‌హోళ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జలమండలి అధికారులను కోరారు. కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ మెయిన్ రోడ్డుపైన భూగర్భ డ్రైనేజీ ప్రధాన లైన్ మ్యాన్‌హోళ్లు మొత్తం కూలిపోవడంతో స్థానికులు కార్పొరేటర్ పవన్‌కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ అక్కడికి వెళ్లి పరిశీలించారు. జలమండలి అధికారులు ఆరీఫ్, దయాకర్‌లను పిలిపించి కూలిపోయిన డ్రైనేజీ లైన్‌ను చూపించారు. ప్రధాన రోడ్డులోని డ్రైనేజీ లైన్ కావడంతో ప్రజలకు చాలా ఇబ్బందులు కలుగుతాయని వెంటనే మ్యాన్‌హోల్స్ మరమ్మత్తులు చేపట్టాని కోరారు. కార్యక్రమంలో స్థానిక కాలనీ వాసులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తప్పిపోయిన వృద్ధురాలు.. ఇంటికి చేర్చిన పోలీసులు


ఈశ్వరమ్మ

చైతన్యపురి: డెబ్బై సంవత్సరాల ఓ వృద్ధురాలు చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని సత్యనగర్ ప్రాంతంలో తిరుగుతోంది. ఎక్కడికి పోవాలో తెలియక ఇబ్బంది పడుతుండగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆమె స్టేషన్‌కు తీసుకొచ్చి వివరాలు రాబట్టేందుకు యత్నించారు. ఈశ్వరమ్మ అని పేరు మాత్రమే చెప్పగా ఎక్కడ నివసించేది చెప్పలేక పోతోంది. బిడ్డ ఇంటికి వచ్చాను అంది. దీంతో పోలీసులు సమీప కాలనీల్లో వాకబు చేసినా వృద్ధురాలు ఎవరనేది గుర్తించలేక పోయారు. చర్చి దగ్గర ఇల్లు అని చెప్పడంతో ఆమెను తీసుకుని మూసారంబాగ్, చాదర్‌ఘాట్ ప్రాంతాల్లో తిప్పారు. చివరికి చాదర్‌ఘాట్‌లో తన ఇంటిని గుర్తుపట్టడంతో ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ పాండుగౌడ్ తెలిపారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 15, వంకాయ 18, బెండ 45, పచ్చిమిర్చి 55, కాకర 35, బీర 45, క్యాబేజీ 20, ఫ్రెంచి బీన్స్ 65, క్యారెట్ 23, దొండ 20–28, చిక్కుడు 35–55, గోకర 35, బీట్‌రూట్ 23. క్యాప్సికం 70, ఆలు 25, దోస 18, సొర 9, పొట్ల 18, ఉల్లిగడ్డ 22, చామగడ్డ 35. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

గుడ్‌ఫ్రైడేకు ఏర్పాట్లు పూర్తి

దిల్‌సుఖ్‌నగర్: గుడ్‌ఫ్రైడే వేడుకలకు మలక్‌పేట్‌జోన్ పరిధిలోని చర్చీలన్నీ సిద్ధమయ్యాయి. మూసారంబాగ్‌లోని బేతనీయ బాప్టిస్టు చర్చి, దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చి, మలక్‌పేట మెథడిస్ట్, అక్బర్‌బాగ్ హోరేబు ఆరాధన మందిరం, ఆస్మాన్‌ఘడ్ రాక్ చర్చితో పాటు పలు ఇతర ప్రాంతాలలోని చర్చీలను ప్రత్యేక ప్రార్థనల కోసం అలంకరించారు. ప్రత్యేక ప్రార్థనల కోసం చర్చీల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు.

పోలీసుల నుంచి రక్షణ కల్పించాలని డీజీపీకి వినతి

కాచిగూడ: పోలీసుల నుంచి తనకు రక్షణ కల్పించాలని ఓ వ్యక్తి గురువారం రాష్ట్ర డీజీపీని ఆశ్రయించాడు. ఈ సందర్భంగా తెలంగాణ కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సూదమళ్ల వెంకటస్వామితో కలిసి నారాయణగూడలోని పార్టీ కార్యాలయంలో కమ్మరి కాలప్ప మాట్లాడుతూ, తన తండ్రి, సోదరుడి భార్య కలిసి తనపై అక్రమంగా కేసులు పెట్టారన్నాడు. పోలీసులు రౌడీషీట్ తెరిచి బైండోవర్ పేరుతో గంటల తరబడి ఠాణాలో కూర్చోబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టును ఆశ్రయించగా రౌడీషీట్ కొట్టివేసిందని చెప్పాడు. ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి సమయాల్లో తమ ఇంటి వద్ద రెక్కీ నిర్వహిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశాడు.

నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత


ఇంకుడు గుంతల నిర్మాణంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గున్న రాజేందర్‌రెడ్డి

హయత్‌నగర్: జీవ జాతికి ప్రాణాధారమైన నీటిని సంరక్షించి పొదుపుగా వాడుకోవాలని, లేకుంటే భవిష్యత్ తరాలకు కన్నీళ్లే మిగులుతాయని గాంధేయన్ విద్యాసంస్థల చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి అన్నారు. జాతీయ జల దినోత్సవం సందర్భంగా జలమండలి, గాంధీ జ్ఞాన్‌ప్రతిష్టాన్ ఆధ్వర్యంలో గురువారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని కుంట్లూర్‌లో ఉన్న గాంధేయన్ కళాశాలలో నీటి వాడకం, సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గున్న రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ, నగరాలు కాంక్రీట్‌తో నిండిపోవడం వల్ల వర్షం నీరు భూమిలోకి ఇంకడం లేదన్నారు. గ్రామాల్లో కూడా ఈ విధానం రావడం వల్ల గతంలో ఉన్న చెరువులు, కుంటలు వంటి నీటి వనరులు కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కాంక్రీట్ కారణంగా వర్షం నీరు భూమిలో ఇంకకుండా డ్రైనేజీ ద్వారా సముద్రం పాలవుతుందని తెలిపారు. నీటిని రక్షించేందుకు ఇంకుడు గుంతల నిర్మాణం ఉత్తమమైన మార్గమన్నారు. ఈ విషయంపై గాంధేయన్ సంస్థల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని అన్నారు. గాంధీ సంస్థల వైస్ చైర్మన్ యానాల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నీటి సంరక్షణపై విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గాంధీ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ కృష్ణయ్య, ప్రేమ్‌కుమార్, నాయకులు శివారెడ్డి, ప్రణీత్‌కుమార్‌రెడ్డి, చైతన్యరెడ్డి, భార్గవ్, సతీష్, సాయి, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

వరదనీటి కాలువ పనులు వేగవంతం చేయాలి: వంగ


వరదనీటి కాలువ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డితో కాలనీవాసులు

చంపాపేట: డివిజన్‌లోని పలు కాలనీల్లో చేపట్టిన బాక్స్ టైప్ వరదనీటి కాలువ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని, పనులను వేగవంతం చేయాల్సిన బాధ్యత అధికారులు, కాంట్రాక్టర్లపై ఉందని స్థానిక డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన ఉదయ్‌నగర్, పద్మానగర్, సూర్యానగర్, మల్‌రెడ్డి రంగారెడ్డి కాలనీవాసుల ఫిర్యాదు మేరకు కాలనీల్లో పాదయాత్ర నిర్వహించి నత్త నత్తనడకన సాగుతున్న బాక్స్‌టైప్ కాలువ పనులను పరిశీలించారు. అనంతరం మధుసూదరెడ్డి మాట్లాడుతూ, వరద నీటి కాలువ ఏర్పాటు చేసే క్రమంలో కాలనీల్లోని సీసీ రోడ్లు, తాగునీటి పైప్‌లైన్, భూగర్భ డ్రైనేజీ పైప్‌లను తవ్వేయడం వల్ల కాలనీవాసులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనుల్లో జాప్యం చేస్తే బాధిత కాలనీవాసులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు అమరేందర్, కాళిదాసు, మహేందర్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, గంగాధర్‌రెడ్డి, వెంకటేష్ జయవర్ధన్‌రెడ్డి, వీరారెడ్డి, సుధాకర్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు


ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను తొలగించాలని పోలీసులను కోరుతున్న కాలనీవాసులు

చైతన్యపురి: ఫుట్‌పాత్ వ్యాపారులు సర్వీస్‌రోడ్డును ఆక్రమించుకుని వ్యాపారాలు చేయటం వల్ల కాలనీల్లో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, మెట్రో ప్రయాణికులు నడవటానికి దారిలేక అవస్థలు పడుతున్నారని చైతన్యపురి డివిజన్‌లోని ప్రభాత్‌నగర్, సాయినగర్ కాలనీల ప్రజలు చేసిన ఫిర్యాదుపై ట్రాఫిక్ అధికారులు గురువారం స్పందించారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న వారిని, సర్వీస్ రోడ్డులో ఉన్న తోపుడుబండ్లను అక్కడ నుంచి తొలగింపజేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలిగిస్తున్న డీసీఎం వాహనాలకు చలాన్లు వేశారు. చైతన్యపురి కార్పొరేటర్ రంగానర్సింహ గుప్తా ఆధ్వర్యంలో అక్కడకు చేరుకున్న పలు కాలనీల ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యను ట్రాఫిక్ పోలీసులకు వివరించారు. ఎంతో కాలంగా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కాలనీలోకి అంబులెన్స్ కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని ఆరోపించారు. ఈదారి గుండా మహిళలు నడవాలంటేనే బయపడుతున్నారని అన్నారు. చిరువ్యాపారులు మళ్లీ సర్వీస్‌రోడ్డు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇకముందు ఇబ్బందులు కాకుండా చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు జగదీష్, నాగరాజు గౌడ్ కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

ముగిసిన నేషనల్ లెవల్ టెక్నికల్ ఫెస్ట్


ఫెస్ట్‌లో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ స్ఫూర్తి ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం 2కె24 పేరిట ప్రారంభమైన నేషనల్ లెవల్ టెక్నికల్ ఫెస్ట్ గురువారం ముగిసింది. రోబోకోడ్, స్క్రాచ్ గేమ్స్, హ్యాక్‌థాన్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో, బ్లాక్ చైన్ టెక్నాలజీ మీద కాంటెస్ట్, మరియు టెక్నికల్ క్విజ్ నిర్వహించారు. వీటితో పాటు పలు రంగాల్లో పోటీ నిర్వహించి విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో మేధాశక్తిని పెంపొందించొచ్చన్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని పలు ఇంజనీరింగ్ కళాశాలలనుంచి సుమారు 200లకు పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాలేజీ సెక్రెటరి ఎస్ జగన్మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డి మహేశ్వర్, డీన్ డాక్టర్ గిరిధర్, ప్రోగ్రామ్ కన్వీనర్స్ ప్రొఫెసర్ రాంమ్మోహన్‌రావు, డాక్టర్ రమేశ్‌రావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ మహమ్మద్ ముస్కిన్ అలీ, ఖలీల్ అహ్మద్, మహ్మద్ అఫ్జల్, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి


విద్యార్థులకు ప్రశంస పత్రాల ప్రదానం

మీర్‌పేట: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని వనస్థలిపురం జోన్ నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ బాబ్జీ పేర్కొన్నారు. పాఠశాలలో జరిగిన స్పెల్‌బీ జోనల్ స్థాయి క్విజ్ పోటీల్లో మీర్‌పేట నారాయణ విద్యార్థులు సత్తా చాటారని ఆయన అన్నారు. ఈ పోటీల్లో తొమ్మిదోతరగతి సాయి సుజిత్, బి. ఋత్విక్ ప్రథమ, పల్లవి, వైష్ణవి, సాయినిఖిల్, శ్రేష్ఠ, త్రిజల్, పుష్పహాస్‌లు ద్వితీయ బహుమతులు గెల్చుకున్నారన్నారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కష్టపడి చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ శివరంజని, సీఓ మనోహర్, ఏడీ రాజేందర్, బోజిరెడ్డి, యోగేంద్ర పాల్గొన్నారు.

కాలనీల్లో నీటి కష్టాలు షురూ

- ముదురుతున్న ఎండలు... అడుగంటుతున్న బోరుబావులు
- లోప్రెషర్‌తో నల్లా నీటిసరఫరా
- నీటి ట్యాంకర్లను ఆశ్రయిస్తున్న ప్రజలు


విశ్వేశ్వరాయ ఇంజనీర్స్ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌కు నీటిని తీసుకొచ్చిన ట్యాంకర్

వనస్థలిపురం: రోజు రోజుకూ ఎండలు ముదురుతుండటంతో కాలనీల్లో నీటి కష్టాలు మొదలయ్యాయి. కాలనీల్లో బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తుండటంతో నీటి వాడకం పెరిగింది. దీనికితోడు గత వర్షాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో బోరు బావులు అడుగంటుతున్నాయి. జలాశయాలలో నీటి నిల్వలు తగ్గడంతో సహజంగానే జలమండలి నల్లా నీటి సరఫరాలో సమయం, ప్రెషర్ తగ్గింది. పలు కాలనీల్లో లోప్రెషర్‌తో నీటి సరఫరా జరుగుతుండటంతో సరిపడా నీరు అందక కాలనీల ప్రజలు ప్రైవేట్ నీటి ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. మార్చిలోనే ఇలా ఉంటే.. ఇక ఏప్రిల్, మే నెలలో పరిస్థితి ఎలా ఉంటుందోనని కాలనీల ప్రజలు వాపోతున్నారు.

విచ్చలవిడిగా బోరు బావుల తవ్వకం...

వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్, హస్తినాపురం, హయత్‌నగర్, మన్సూరాబాద్, నాగోలు తదితర డివిజన్లలో బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాలు శరవేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. దీంతో సహజంగానే నీటి వాడకం ఎక్కువవుతోంది. దీంతో విచ్చలవిడిగా బోరు బావుల తవ్వకాలు సాగుతున్నాయి. బడా నిర్మాణ సంస్థలు తమ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 1500 నుంచి 2000కు పైచిలుకు ఫీట్ల లోతుగా బోరు బావులను తవ్వి భూగర్భ జలాలను తోడేస్తున్నారు. దీంతో కాలనీల్లో మామూలు లోతులో ఉన్న బోరు బావులు ఎండిపోతున్నాయి.

తప్పనిసరిగా నీటి కొనుగోలు..

కాలనీల్లో జలమండలి రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తోంది. ఇంతకు ముందు రెండు గంటలపాటు సరఫరా ఉండగా, ప్రస్తుతం గంటసేపు మాత్రమే సరఫరా జరుగుతోంది. దీనికితోడు పలు ప్రాంతాల్లో లోప్రెషర్‌తో సరఫరా జరుగుతుండటంతో సరిపోను నీరు రావడం లేదని కాలనీల వారు వాపోతున్నారు. ఉన్న బోర్లు అడుగంటిపోవడంతో గత్యంతరం లేక జలమండలి నుంచి 5000 వేల లీటర్ల కెపాసిటీ గల ట్యాంకర్‌ను రూ. 500 లకు తెప్పించుకుంటున్నారు. అయితే మంచినీటిని సరఫరా చేసే జలమండలి నీటి ట్యాంకర్లకు డిమాండ్ ఎక్కువగా ఉండటం, బుక్ చేసినా రెండు రోజులకు గానీ ట్యాంకర్ రాకపోవడంతో కాలనీల ప్రజలు గత్యంతరం లేక ప్రైవేట్ ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. అయితే ఇదే అదునుగా 5500 లీటర్ల సామర్థ్యం గల ట్యాంకర్లను రూ. 600 నుంచి రూ. 1000 వరకు ప్రైవేట్ ట్యాంకర్ల యజమానులు వసూలు చేస్తున్నారు.

నీటి పొదుపే మేలు...

నీటి ఎద్దడి నివారణకు ఉన్న జలాలను పొదుపుగా వాడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. పలు ప్రాంతాల్లో జలమండలి సరఫరా చేసే నీటిని వాహనాలు శుభ్రం చేయడానికి, ఇంటి ఆవరణ, ఇంటి ముందు కడగడానికి, చెట్ల పెంపకం పేరుతో వృధా చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. భూగర్భ జల రక్షణకు ప్రతిఒక్కరూ తమ ఇల్లు, పరిసరాల్లో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు, పలు సంస్థలు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నా ఫలితం ఉండటం లేదు. కాగా జలమండలి ఆధ్వర్యంలో నీటి సరఫరా చేసే సమయంలో పలు ప్రాంతాల్లో లీకేజీలతో విలువైన నీరు వృథాగా రోడ్లపాలు అవుతోందని, లీకేజీలను అరికట్టడానికి జలమండలి కూడా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.